క్లుప్తంగా

పోస్టర్ల ఆవిష్కరణ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో సోమవారం సీపీఐ ప్రజాపంథా నాయకుల ఆధ్వర్యంలో కామ్రేడ్ రవి వర్ధంతి సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రజాపంథా నాయకుడు దేవారం మాట్లాడుతూ.. ప్రజా పంథా రాష్ట్ర కార్యదర్శిగా పని చేసి అమరుడైన కామ్రేడ్ రవన్న వర్ధంతి జయప్రదం చేయాలని కోరారు. హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే సభలో పలువురు వక్తలు హాజరై ప్రసగించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

గుడాల పంపిణీ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని లక్ష్మీనారాయణ మందిరంలో క్షత్రియ సమాజ్ అధ్యక్ష, కార్యదర్శులు మదన్‌మోహన్, బారడ్ గంగామోహన్ ఆధ్వర్యంలో సోమవారం క్షత్రియ కులస్తులకు గుడాలను పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడా హోలీ పండుగను పురస్కరించుకొని గుడాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆదివారం రాత్రి కామదహనం నిర్వహించారు.

బడి పనుల పరిశీలన



భీమ్‌గల్: మండలంలోని ఎంపీయూపీఎస్ బాబానగర్ పాఠశాలలో జరుగుతున్న మన ఊరు–మన బడి పనులను పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ శ్రీనివాస్ మాట్లాడుతూ.. పాఠశాల ఆవరణలో పచ్చదనం, పిల్లలు ఆడుకునే విధంగా పరిసరాలను శుభ్రం చేయాలని అన్నారు. ఆయన వెంట ఎంఈవో స్వామి, ఎంపీడీవో రాజేశ్వర్, ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీ నారాయణ ఉన్నారు.

కంటి వెలుగు ప్రారంభం



బాల్కొండ: మెండోరా మండలం చాకిర్యాల్‌లో కంటి వెలుగు కార్యక్రమన్ని సోమవారం సర్పంచ్ ఎడ్ల లింగవ్వ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..శిబిరాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఎంపీడీవో శ్రీనివాస్, వైద్యాధికారిణి ప్రణవ, ఉప సర్పంచ్ గంగారెడ్డి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

ఎడపల్లి(బోధన్): ఎడపల్లి తహసీల్ కార్యాలయం ఎదుట సోమవారం మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం నుంచి జిల్లాకు రావలసిన రూ.20 కోట్లు వెంటనే విడుదల చేయాలని, ప్రతి నెలా 10లోపు బిల్లులు చెల్లించాలని, పెంచిన వేతనాలు ఏప్రిల్–2022 నుంచి అమలు చేయాలని కోరుతూ తహశీల్దార్ శేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ కల్పించాలని, అక్రమ తొలగింపులు అరికట్టాలని, రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు.

వర్నిలో బ్లాక్ లెవల్ క్రీడలు

వర్ని: నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం వర్ని బాలుర పాఠశాల ఆవరణలో బ్లాక్ లెవల్ క్రీడా పోటీలను నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రన్నింగ్ పోటీలను నిర్వహించి, పోటీల్లో విజేతలుగా నిలిచిన వారిని జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు అర్హులుగా గుర్తించారు. విజేతలకు నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ప్రశంసా పత్రాలు జ్ఞాపికలు అందజేశారు.

చట్టాలను వినియోగించుకోవాలి

రెంజల్(బోధన్): మహిళలకు ప్రభుత్వాలు కల్పించిన రక్షణ చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని వక్తలు సూచించారు. మహిళా దినోత్సవం సందర్భంగా వీరన్నగుట్టలో సోమవారం పలు కార్యక్రమాలను నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో ముగ్గుల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో వీరన్న గుట్ట, వీరన్నగుట్ట తండా గ్రామాల సర్పంచ్‌లు రాజు, గణేశ్‌నాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీలారాణీ పాల్గొన్నారు.

మహిళలు అన్నింట్లో రాణించాలి

- ఘనంగా మహిళా దినోత్సవం
- మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పలువురి ప్రసంగం



వేల్పూర్‌లో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

రుద్రూర్: ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకుని మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీపీ అక్కపల్లి సుజాత అన్నారు. మండల కేంద్రంలోని అంగన్ వాడి కేంద్రంలో సోమవారం మహిళ దినోత్సవం నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. చందూర్ మండలం ఘన్‌పూర్ అంగన్‌వాడి కేంద్రంలో మహిళలకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

సమానత్వం చాటుకోవాలి

ఎడపల్లి(బోధన్): మహిళలు అన్ని రంగాలలో రాణించి తమ సమానత్వం చాటుకోవాలని బోధన్ ఎమ్మెల్యే సతీమణి అయేషా ఫాతిమా పేర్కొన్నారు. సోమవారం ఎడపల్లి మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించి అయేషా ఫాతిమాను సన్మానించారు. జెడ్పీ ఉపాధ్యక్షురాలు రజిత యాదవ్ మాట్లాడుతూ.. నిరక్షరాస్యతను నిర్మూలించేందుకు బాలికా విద్యపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

బోధన్ పట్టణంలో..

బోధన్‌టౌన్(బోధన్): బోధన్‌లోని రెండో వార్డు అంగన్‌వాడీ సెంటర్‌లో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్ ఆటలు ఆడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీవో జానకి విజేతలకు బహుమతులు అందించారు.

చీరలు పంపిణీ చేసిన మంత్రి

వేల్పూర్: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తన సొంత ఖర్చుల తో సోమవారం వేల్పూర్ సాయిబాబా ఆలయం వద్ద వేయి మంది మహిళలకు ఆయన సతీమణి నీరజారెడ్డితో కలిసి చీరలు పంపిణీ చేశారు. అనంతరం మహిళలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి దంపతులను మహిళలు శాలువాతో ఘనంగా సన్మానించారు.



రుద్రూర్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ సుజాత



బోధన్ ఎమ్మెల్యే సతీమణి ఫాతిమాకు సన్మానం



బోధన్‌లో మాట్లాడుతున్న సీడీపీవో జానకి

అటెన్షన్ ప్లీజ్.. ప్రమాదం జరగకపోతే పట్టించుకోరా?



గాలిబ్‌నగర్ వద్ద రహదారికి పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

మాక్లూర్ మండలంలోని దాస్‌నగర్ నుంచి నందిపేట వెళ్లే ప్రధాన రహదారి గాలిబ్‌నగర్, మెట్టు మధ్యన రహదారికి అతి సమీపంలోనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఆ ప్రాంతంలో అనుకోకుండా రోడ్డు ప్రమాదం జరిగితే అక్కడ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తగిలి భారీగా ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉంటుంది. ఇదే ప్రాంతంలో రెండు చోట్ల రోడ్డుకు అతి సమీపంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. వాటిని వెంటనే రహదారికి కొద్ది దూరంలో ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. – మాక్లూర్

ప్రశ్నించాల్సిన అధికారి పేరు: గోపి నాయక్, ఏఈ, మాక్లూర్

ఫోన్ నంబర్ : 94408 11623

ప్రార్థనా మందిరాల వద్ద వసతులు కల్పించండి

బోధన్‌టౌన్(బోధన్): రంజాన్ పండుగ నేపథ్యంలో ఈ నెల 23 నుంచి ప్రారంభమయ్యే ఉపవాస దీక్షల సందర్భంగా ప్రార్థనా మందిరాల వద్ద వసతులు కల్పించాలని ఎంఐఎం పార్టీ నాయకులు కోరారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్‌కు వినతి ప్రతం అందించారు. మందిరాల్లో వసతులతో పాటు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, చెత్త సేకరణకు ఆటోలను పంపించాలని కోరారు.



నాయకులు రాషత్, ఎజాజ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులు అరికట్టాలి

బోధన్‌టౌన్(బోధన్): బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలపై అత్యాచారాలు, దళితులు, మైనార్టీలపై దాడులు విపరీతంగా జరుగుతున్నాయని వాటిని అరికట్టాల్సిన అవసరం ఉందని ప్రగతి శీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోదావరి అన్నారు. బోధన్‌లో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రగతి శీల మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మనువాద భావజాలాన్ని జనంపై రుద్దుతున్నారని అన్నారు. రాష్ట్రంలో మిషన్ భగీరథ ఏమో గాని మద్యం భగీరథ విజయ వంతంగా నడుస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు నాగమణి, జిల్లా నాయకులు బిపాషా బేగం, స్వరూప, సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా నేత మల్లేష్, మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘం నేత గోదావరి

ఆకట్టుకున్న కుస్తీ పోటీలు

హోలీ పండుగ సందర్భంగా బోధన్ నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో కుస్తీ పోటీలు నిర్వహించారు. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొనేందుకు పక్క రాష్ట్రం నుంచి సైతం వచ్చారు. రెంజల్ మండల కేంద్రం, టాపూర్, దూపల్లి, సాలూర మండల కేంద్రంలో, బోధన్ పట్టణంలోని పాత పోస్టాఫీసు సమీపంలో కుస్తీ పోటీలు నిర్వహించారు. – రెంజల్/బోధన్‌టౌన్/బోధన్ రూరల్



రెంజల్‌లో కుస్తీ పడుతున్న మల్లయోధులు



బోధన్ టౌన్: పాత పోస్టాఫీసు సమీపంలో..



సాలూరలో ఒంటిచేతితో వికలాంగుడి కుస్తీ..

ఉత్సాహంగా హోలీ సంబురాలు

ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం హోలీ సంబురాలు జరుపుకున్నారు. అధికారికంగా ఈ నెల 7న హోలీ అయినా కొన్ని గ్రామాల్లో ఒక రోజు ముందు హోలీ జరుపుకున్నారు. యువకులు, పెద్దలు, మహిళలు సోమవారం రంగులు చల్లుకుంటూ హోలీ సంబురాలను ఉత్సాహంగా జరుపుకున్నారు. పలుచోట్ల ఆదివారం రాత్రి కామ దహనం చేశారు. – సాక్షి నెట్‌వర్క్



చందూర్‌లో హోలీ ఆడుతున్న స్థానికులు



రుద్రూర్ మండలం రాయకూర్‌లో..



ముల్లంగి(బి)లో..



వేంపల్లి ప్రాథమిక పాఠశాలలో.. విద్యార్థులు



మోతె విజ్ఞాన్ స్కూల్‌లో..



నందిపేట్‌లో హోలీ సంబురాల్లో చిన్నారులు



రుద్రూర్‌లో కామదహనం చేస్తున్న దృశ్యం

కొనసాగుతున్న 'జిల్లా' దీక్షలు



బోధన్‌టౌన్(బోధన్) : బోధన్‌ను ప్రత్యేక జిల్లా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు చేపట్టిన దీక్షలు 78వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గంగారెడ్డి, న్యాయవాదులు అర్జున్ రాందర్, పాల్దె శంకర్‌లు కూర్చున్నారు. జిల్లాగా ప్రకటించడానికి అన్ని అర్హతలు ఉన్నాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి జిల్లాగా ప్రకటించాల్సిన అవసరం ఉందని నాయకులు వ్యాఖ్యానించారు.

దొన్కల్‌వాసికి విశిష్ట సేవా పురస్కారం



మోర్తాడ్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని కరీంనగర్‌లో సోమవారం నిర్వహించిన జాతీయ కవి సమ్మేళనంలో దొన్కల్‌కు చెందిన వర్ధమాన సామాజిక సినీ గేయ రచయిత శివకుమార్ జిన్నకు విశిష్ట సేవా పురస్కారం అందించారు. తెలంగాణ సామాజిక రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో శివకుమార్ చేస్తున్న సాహిత్య సేవలకు పురస్కారం అందించారు. కార్యక్రమంలో సినీ గీత రచయిత డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ, కరీంనగర్ జిల్లా పరిషత్ చైర్మన్ విజయ, తెలంగాణ సామాజిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నోముల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బంజారాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

మాక్లూర్: బంజారాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని స్థానిక తహసీల్దార్ శంకర్ అన్నారు. సోమవారం అడవి మామిడిపల్లితండాలో జరిగిన 284వ సేవాలాల్ జయంతిలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఒకప్పుడు బంజారా ప్రజలు లోకం పోకడ తెలియక అడవులకే పరిమితం అయ్యారని, కాలక్రమేణా దినాదినాభివృద్ధి చెందుతూ సమాజంలో కలిసి బతకడం శుభపరిణామం అన్నారు. ఇంకా కొన్ని మారుమూల గ్రామాలకు చెందిన బంజారాలు అంతగా చైతన్యం కాలేదని, వారిని కూడా చైతన్యపరుస్తూ అభివృద్ధిలోనికి తేవాల్సిన అవసరం తోటి బంజారాలపై ఉందన్నారు. ఎంపీపీ మాస్త ప్రభాకర్, కార్పొరేటర్ రాజాసింగ్, ఎంపీడీవో క్రాంతి, స్థానిక సర్పంచ్ చింత మల్లారెడ్డి గిరిజన ప్రజలు పాల్గొన్నారు.



సేవాలాల్ జయంతిలో మాట్లాడుతున్న మాక్లూర్ తహసీల్దార్ శంకర్

సమాచారం..

10న ఏఐకేఎంఎస్ సమావేశం



మాక్లూర్: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్ఆర్ భవనంలోఈ నెల 10న జరిగే కౌన్సిల్ సమావేశానికి రైతులు, రైతు కూలీలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య కోరారు. సోమవారం బోర్గాం(కె)లో ఆయన మాట్లాడారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వర్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకన్న పాల్గొంటారని తెలిపారు. కౌన్సిల్ సమావేశం వేదికగా చైతన్యం చేస్తూ తగు ఉద్యమ కార్యాచరణ రూపొందించబోతున్నట్టు భూమయ్య వెల్లడించారు.

దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు



బోధన్‌టౌన్(బోధన్): మైనార్టీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు అందిస్తున్న రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి బోధన్ మున్సిపల్ కార్యాలయంలో బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో యూబీఐ మెయిన్ బ్రాంచ్, శక్కర్‌నగర్, గోశాల బ్రాంచ్ మేనేజర్లు, కెనరా బ్యాంక్ మేనేజర్ కలిసి వివిధ బ్రాంచ్‌ల్లో దరఖాస్తు చేసుకున్న 320 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించారు.

విద్యుత్ తీగల సర్దుబాటుకు నిధులు

నవీపేట: మండల కేంద్రంలోని సుభాష్‌నగర్, దర్యాపూర్, బహదూర్‌పుర కాలనీలలో నివాస గృహాలపై ప్రమాదకరంగా ఉన్న 11కేవీ విద్యుత్‌లైన్ సర్దుబాటుకు ఎట్టకేలకు నిధులు మంజూరయ్యాయి. రూ.11,61,000ల మంజూరు పత్రాన్ని ఎమ్మెల్యే సతీమణి ఆయేషా ఫాతిమా సోమవారం ఎంపీటీసీ మీనాకు అందజేశారు. విద్యుత్ లైన్‌ను సర్దుబాటు చేయాలని పలుమార్లు మండల సర్వసభ్య సమావేశాలలో ఎంపీటీసీ మీన, కో–ఆప్షన్ మెంబర్ అల్తాఫ్‌లు అధికారులను నిలదీశారు. ఎమ్మెల్యే షకీల్‌ను కలిసి సమస్యను విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే సీడీపీ నిధుల నుంచి ప్రత్యేకంగా నిధులు కేటాయించారు.



ఆర్డర్ కాపీని అందజేస్తున్న ఎమ్మెల్యే సతీమణి

చిన్నారులకు పరామర్శ

తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన పోతంగల్ గ్రామ చిన్నారులు నాగలక్ష్మి, సహస్ర, విష్ణు ప్రియలను ఆమె పరామర్శించారు. అండగా ఉంటానని ఆమె ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

సిద్ధుల గుట్టపై ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయాన్ని సోమవారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలకు పల్లకీసేవ చేపట్టారు. అనంతరం 53వ సోమవారం ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. నిజామాబాద్ గిరిరాజ్ కళాశాల విద్యార్థులు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఆలయాన్ని సందర్శించారు. కమిటీ సభ్యులు సుమన్, పీసీ గంగారెడ్డి, కిషన్, మీనాచందు, నక్కల లక్ష్మీన్, మల్లయ్య పాల్గొన్నారు.



స్వామివారి ఉత్సవ విగ్రహాలతో ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకి సేవ నిర్వహిస్తున్న భక్తులు

లింబాద్రి గుట్ట సందర్శన

భీమ్‌గల్: పట్టణ శివారులోని లింబాద్రి గుట్టపై వెలసిన లక్ష్మీ నరసింహ స్వామిని తెలంగాణ ఉమెన్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆకుల లలిత, కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం ఆలయ విశిష్టతలను ఆకుల లలితకు తెలియజేశారు. ప్రత్యేక పూజలు జరిపించారు.



ఆవుల అమ్మకంపై కమిషనర్ సీరియస్

- విచారణకు ఆదేశం

నిజామాబాద్‌నాగారం : సాక్షిలో ప్రచురితమైన 'ఆవులను అమ్మే శారు' అనే కథనంపై నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ చిత్ర మిశ్రా సీరియస్‌గా స్పందించారు. నగరంలో ఏ జోన్ పరిధిలో ఎవరు ఆవులను అమ్మేశారో పూర్తిగా విచారించి నివేదిక ఇవ్వాలని సీసీ ద్వారా సంబంధిత సానిటేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆరు జోన్ల పరిధిలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లలో ఎవరు ఆవులను అమ్మేశారో కచ్చితంగా తెలియాల్సిందేన్నారు. ఈ విషయంపై అధికారులపై తీవ్రంగా మండిపడ్డట్లు తెలిసింది.

సాక్షి ఎఫెక్ట్..